క్లుప్తంగా

15 అడుగుల క్రిస్మస్ స్టార్



15 అడుగుల క్రిస్మస్ స్టార్

దెందులూరు: స్థానిక సాల్వేషన్ ఆర్మీ చర్చి వద్ద గురువారం కోర్ ఆఫీసర్ మేజర్ ఎం రమణయ్య ఆధ్వర్యంలో 15 అడుగుల క్రిస్మస్ స్టార్‌ను సంఘ సభ్యులు ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా క్రిస్మస్ సందర్భంగా స్టార్‌ను చర్చి వద్ద ఏర్పాటు చేస్తున్నామన్నారు. సంఘ సభ్యులు అందరిని రమణయ్య అభినందించారు.

సోలార్ రాయితీపై ప్రచారం



సోలార్‌పై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

దెందులూరు: కేంద్ర ప్రభుత్వం సోలార్‌కు ఇస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లు ఇబ్బందులు లేకుండా జీవించాలని విద్యుత్ శాఖ గ్రామ గ్రామాన కళాకారులు ప్రజాప్రతినిధులు స్వచ్ఛంద సంస్థలతో కలిసి ప్రచారం చేస్తున్నారు. గురువారం గోపన్నపాలెంలో మెయిన్ సెంటర్‌లో ప్రచారం చేశారు. విద్యుత్ శాఖ దెందులూరు మండలం అసిస్టెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, గోపన్నపాలెం మాజీ గ్రామ సర్పంచ్ కొండేటి హనుమంతు, గ్రామ నాయకులు కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

షుగర్ పరీక్షలు తప్పనిసరి



షుగర్ పరీక్షలు చేస్తున్న లయన్స్ సభ్యులు

గణపవరం: షుగర్ వ్యాధి వయస్సుతో నిమిత్తం లేకుండా అందరినీ వేధిస్తోందని, ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా షుగర్ పరీక్షలు చేయించుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పచ్చిపులుసు నాగేశ్వరరావు, కె.విశారద అన్నారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం గణపవరంలో కళాశాల విద్యార్థులు సుమారు 200 మందికి షుగర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కొందరికి షుగర్ లక్షణాలు కనిపించడంతో తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. హెచ్‌బీ పరీక్షలు కూడా నిర్వహించారు. కార్యక్రమంలో లయన్స్ జోన్ చైర్మన్ కె.సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకుల దినోత్సవం



డిగ్రీ కాలేజీ విద్యార్థుల ర్యాలీ

ఉంగుటూరు: నారాయణపురం డిగ్రీ కాలేజీలో గురువారం అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. విరాళాలు సేకరించి, రూ.3 వేలు విలువగల ఆహార పదార్థాలను ఉంగుటూరు అనాథ ఆశ్రమ పాఠశాల పిల్లలకు అందజేశామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ హిప్సాబా తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్మెల్ స్కూల్ ప్రిన్సిపాల్ సిస్టర్ జీవా మాట్లాడుతూ స్వచ్ఛంద సేవ ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు కొండా రవి, నిర్మల జ్యోతి, ఆయేషా, బాబూరావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్రాంతి కుమార్ బహిష్కరణ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): క్రమశిక్షణకు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న జిల్లా సహాయ కార్యదర్శిగా ఉన్న ఎం.క్రాంతికుమార్‌ను విప్లవ విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ నుంచి బహిష్కరించినట్టు ఆ సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నాని, ఎస్ మహర్షి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత ఏజెండాతో పాటు ఇతర సంఘాలతో రహస్య సంబంధాలు కొనసాగిస్తున్న క్రాంతి కుమార్ ప్రాథమిక సభ్యత్వం రద్దు చేశామన్నారు.

కోలుకుంటున్న విద్యార్థిని

బుట్టాయగూడెం: మండలంలోని ఇప్పలపాడు సమీపంలో ఉన్న ఏకలవ్య పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థిని కుర్లా హేమలత ఆరోగ్యం మెరుగుపడి కోలుకుంటుందని వైద్యులు తెలిపారు. యోగాకు ఆలస్యంగా వచ్చిందని టీచర్ గుంజీళ్లు తీయించడంతో అస్వస్థతకు గురై స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న విషయం పాఠకులకు విదితమే. టైఫాయిడ్, మలేరియాతో బాధపడుతున్న హేమలతను సబ్ యూనిట్ ఆఫీసర్ వి.పెద్దిరాజు కలిసి ఆమె ఆరోగ్యస్థితి గతులను అడిగి తెలుసుకున్నారు.

ధాన్యం ఆరబోతకు అవస్థలు

- కల్లాల్లేక రోడ్లపైనే ధాన్యం
- సీసీ కెమెరాలతో రైతులకు భరోసా
- తేమ శాతం నిబంధనలు సడలించాలని డిమాండ్



పాతూరు హైవే ధాన్యం ఆరబోస్తున్న కూలీలు

భీమడోలు: తుఫాన్ నేపథ్యంలో ధాన్యంలో తేమ శాతం తగ్గించుకోవడానికి అన్నదాతలు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. వరి క్షేత్రాల వద్ద సామూహిక కళ్లాలు లేకపోవడంతో ధాన్యాన్ని జాతీయ, రాష్ట్రీయ రహదారులపై ఆరబోసుకుంటున్నారు. భీమడోలు మండలంలో గుండుగొలను నుంచి తాడేపల్లిగూడెం, అలాగే గుండుగొలను నుంచి కొవ్వూరు వరకు ఉన్న జాతీయ రహదారులపైనే ధాన్యాన్ని ఆరబోస్తున్నారు. ధాన్యం దొంగల పాలు కాకుండా రహదారులపై ఉన్న సీసీ కెమెరాలు రైతులకు భరోసాగా నిలిచాయి. దీంతో ఉదయం ఆరబోసిన ధాన్యాన్ని సాయంత్రం గుట్టగా ఒక చోటకు చేర్చి రైతులు వెళ్లిపోతున్నారు. 10 రోజుల పాటు రోడ్లపై ధాన్యం ఆరబోతకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలకు వరి కంకుల నుంచి గింజ రాలిపోతుండడంతో దిక్కుతోచని స్థితిలో వరి కోత యంత్రం ద్వారా పంట మాసూళ్లు చేసి, రోడ్లపై ధాన్యం ఆరబోసుకుంటున్నారు. రహదారులపై వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యం ఉంది. ధాన్యం ఆరబోతకు రోజుకు ఎకరాకు ఇద్దరు కూలీలకు రూ.1000 ఖర్చు చేస్తున్నారు. సామూహిక కల్లాలు లేని లోటును రహదారులు తీర్చుతున్నాయని రైతులు చెబుతున్నారు. అధికారుల నుంచి ఎటువంటి భరోసా లేదని, సీసీ కెమెరాలే తమ ధైర్యమని వివరిస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 వేలకు పైగా పెట్టుబడి పెరిగిందని వాపోతున్నారు. తేమ శాతం నిబంధనలను సడలించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు అధికారులను కోరుతున్నారు.

కల్లాలకు ప్రతిపాదనలు



వర్షాలు పడే తరుణంలో రైతులు ధాన్యాన్ని రోడ్లపైకి తెచ్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. రైతులు పండించిన పంట మాసూళ్లకు సామూహిక కల్లాలు ఉంటే మేలు జరుగుతుంది. అయితే మండల పరిధిలో ఎక్కడా ఇలాంటి కల్లాలు లేవు. కల్లాల ఏర్పాటుకు అవసరమైన స్థలాల కోసం ఉన్నతాధికారుల వద్ద ప్రతిపాదనలు ఉన్నాయి.

– ఎస్‌పీవీ ఉషారాణి, ఏఓ, భీమడోలు



ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు





గుండుగొలను వద్ద హైవేపై ఆరబోసిన ధాన్యం రాశులు, జాతీయ రహదారిపై ఉన్న సీసీ కెమెరాలతో ధైర్యంగా ఉన్న రైతులు

శాస్త్రోక్తంగా ఆలయ శిఖర ప్రతిష్ఠ



ఆలయ శిఖర ప్రతిష్ఠ చేస్తున్న పండితులు, ధర్మకర్తలు

భీమడోలు: గుండుగొలను బ్రాహ్మణ చెర్వు వద్ద ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠ వేడుక శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాస్తు జ్యోతిష్య శుక్ల యజుర్వేద శాస్త్ర పురోహితులు కోడూరి సాయి కిషోర్ శర్మ ఆధ్వర్యంలో శిఖర ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్తలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: ప్రతి ఒక్కరూ క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.ప్రియాంక అన్నారు. గురువారం పిప్పర సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రజలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



గణపవరం బూత్ నుంచి బ్యాలెట్ బాక్సులు తరలిస్తున్న అధికారులు



ఉంగుటూరు హైస్కూల్లో పోలింగ్ నిర్వహిస్తున్న దృశ్యం

గణపవరం: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. గణపవరం మండలంలో మొత్తం 95.45 శాతం పోలింగ్ నమోదైనట్టు తహసీల్దార్ అప్పారావు తెలిపారు. మొత్తం 66 మంది ఓటర్లలో 63 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్టు చెప్పారు. ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి, పోలింగ్ సరళిని పరిశీలించారు.

భీమడోలులో 93.41 శాతం

భీమడోలు: స్థానిక పాఠశాల పోలింగ్ కేంద్రంలో 91 మంది ఓటర్లలో 85 మంది ఓటేశారు. దీంతో 93.41 శాతం పోలింగ్ శాతం నమోదైందని తహసీల్దార్ బి.రమాదేవి తెలిపారు. సీఐ యూజే విల్సన్ పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను విధించారు.

ఉంగుటూరులో 92.75 శాతం

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో 92.75 శాతం ఓటింగ్ నమోదైంది. ఉంగుటూరు హైస్కూల్లో మొత్తం 69 మందికి 64 మంది ఓటు వేశారు. పోలింగ్ ప్రక్రియను తహసీల్దార్ పూర్ణ చంద్ర ప్రసాదు పర్యవేక్షించారు.

బొర్రా, గంధంల మధ్యే పోటీ

నిడమర్రు: స్థానిక గాదిరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 26 మంది ఓటర్లకు 25 మంది టీచర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్టు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. బ్యాలెట్ బాక్సులను ఏలూరు తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించారు. ప్రధానంగా పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపి మూర్తికి పలు ఉపాధ్యాయ సంఘాల మద్దతు ప్రకటించిన గంధం నారాయణ రావు మధ్య పోటీ ఉన్నట్టు ఉపాధ్యాయ వర్గాలు తెలిపాయి.

పోలైన 67 ఓట్లు

దెందులూరు: స్థానిక గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాల పోలింగ్ బూత్‌లో 77 ఓట్లకు 67 ఓట్లు పోలయ్యాయని తహసీల్దార్ బి.సుమతి తెలిపారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు.

ఓటేసిన 64 మంది టీచర్లు

పెదవేగి : పెదవేగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో మొత్తం 65 ఓట్లకు 64 ఓట్లు పోలయినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ భ్రమరాంబ తెలిపారు. వీరిలో 37 పురుషులు, 27 మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పెదపాడులో 90 శాతం

పెదపాడు : స్థానిక హైస్కూల్లో పీఎస్ 91లో 90 శాతం పోలింగ్ నమోదైందని తహసీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి తెలిపారు. 72 మందికి 65 మంది టీచర్లు ఓటేశారని చెప్పారు.

ఏసుక్రీస్తు బోధనలు ఆచరణీయం



కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తు గేయాలు ఆలపిస్తున్న పాస్టర్లు, విశ్వాసులు

భీమడోలు: నజరేయుడైన ఏసుక్రీస్తు బోధనలు ప్రతిఒక్కరికీ ఆచరణీయమని జంగారెడ్డిగూడెం పాస్టర్ భరత్ ఉద్బోధించారు. భీమడోలు మండల ఐక్య పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి పోలసానిపల్లిలోని ఏసయ్య కృపా సన్నిధి ప్రార్థనాలయంలో సెమీ క్రిస్మస్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసారు. క్యాండిల్ సర్వీసు నిర్వహించారు. ఏసుక్రీస్తు మహారాజుకు జైజై ధ్వనాలతో మార్మోగింది. పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్షుడు రెవరెండ్ డీవీ రత్నం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రసంగీకుడు భరత్ మాట్లాడుతూ క్రైస్తవులంతా ఎంతో పవిత్రతతో, ఆనందోత్సాహాల నడుమ ఈ పండుగ నిర్వహించుకుంటారని తెలిపారు. ప్రేమ, దయ, జాలి, కరుణ కలిగిన ఏసుక్రీస్తు మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. తొలుత క్రైస్తవ గేయాలు పాడి ఆకట్టుకున్నారు. అనంతరం ప్రేమ విందు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఇంజేటి విజయ్ అచ్యుతం, కార్యదర్శి ఏషయా, కోశాధికారి విశ్వేశ్వరరావు, కార్యనిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గణపవరం: ఇటీవల విపరీతమైన పనిభారం పెరిగి ఏ కార్యక్రమానికీ న్యాయం చేయలేని పరిస్థితి ఏర్పడిందని పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు. గణపవరం మండలంలోని గ్రామ సచివాలయ కార్యదర్శులు ఈ మేరకు ఎంపీడీఓ బీబీ శ్రీలక్ష్మికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. తొలుత ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల గౌరవ అధ్యక్షుడు డి.శివరామ్‌ప్రసాద్, అధ్యక్షుడు నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులకు సచివాలయం విధులతో పాటు పన్నుల వసూళ్లు, వివిధ రకాల సర్వేలతో ఇబ్బంది పడుతున్నామని, ఒక్కొక్క కార్యదర్శి రెండు మూడు గ్రామాలకు ఇన్‌చార్జి బాధ్యతలు వహిస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామానికీ ఒక కార్యదర్శిని నియమించాలని వారు కోరారు. కార్యక్రమంలో మండల యూనియన్ నాయకులు చంటిబాబు, బుజ్జమ్మ, భాస్కర్, రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ దరఖాస్తుల్లో నిబంధనలను సడలించాలి



ఏడీ రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

భీమడోలు: మంచానికే పరిమితమైన దివ్యాంగులకిచ్చే పింఛన్ల దరఖాస్తుల్లో నిబంధనలను సడలించాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు మామిడిపల్లి నాగభూషణం, జిల్లా నాయకులు ఏలూరులో గురువారం ఆ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఎంపీ పుట్టా మహేష్ కార్యాలయ ప్రతినిధుల దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. నరాలు చచ్చుపడి మంచం పట్టి నడవలేని స్థితిలో ఉండి 85 శాతం కన్నా ఎక్కువగా వైకల్యం ఉందని సదరం ధ్రువీకరణ పత్రం పొందిన దివ్యాంగులకు నెలకు రూ.15 వేల పింఛన్ అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తామని పేర్కొంది. డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి దరఖాస్తులు తీసుకెళ్లగా సదరం ధ్రువీకరణలో నిర్ధారించిన శాతం ఉన్నా న్యూరాలజిస్ట్ సంతకం చేయించాలని నిబంధన పెడుతున్నారని నాయకులు తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలోని న్యూరాలజిస్ట్ లేరని, విషయాన్ని డీఎంహెచ్‌ఓ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేయించుకోవాలని చెబుతున్నారని వివరించారు. విజయవాడ వెళితే వేరే జిల్లా వారికి ధ్రువీకరణ చేయబోమని చెప్పడంతో జిల్లాలో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఏలూరు ఆసుపత్రిలో న్యూరాలజిస్ట్ పోస్టును భర్తీ చేయించాలని, లేనిపక్షంలో సదరం ఆధారంగా అవకాశం ఇవ్వాలని నాయకులు కోరారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని ఏడీ బి.రామ్‌కుమార్ హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు.

హానికారక కెమికల్స్ తరలిస్తున్న వ్యక్తులపై కేసు

భీమడోలు: హానికారక కెమికల్స్ తయారీ చేసి అక్రమంగా తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులపై గురువారం రాత్రి భీమడోలు పోలీసులు నమోదు చేశారు. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన ముదునూరి సత్యనారాయణ రాజు అనే వ్యక్తి భీమడోలు మండలం అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని కొండ్రెడ్డి నగర్ శివారున లైసెన్స్ లేకుండా పాతటైర్ల నుంచి ఆయిల్ తీసి, దానిని అదే గ్రామానికి చెందిన దంపనబోయిన ఆంజనేయులు ద్వారా హైదరాబాద్‌లోని కృష్ణ అనే వ్యక్తికి సరఫరా చేస్తున్నారు. మెడికల్ వేస్ట్ లిక్విడ్‌లో కలిపి కలిసి ఆయిల్‌ను తీసి వాతావరణాన్ని కలుషితం చేస్తూ ప్రజల ఆరోగ్యానికి హాని కలిగేలా అక్రమంగా వ్యాపారం చేస్తున్నాడు. హానికరమైన కెమికల్స్‌ను తయారు చేస్తున్న వారిపై భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందిస్తున్న ప్రతినిధులు

భీమడోలు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ గురువారం మండలంలోని గుండుగొలను, భీమడోలు, పోలసానిపల్లి గ్రామాల్లోని పేదలకు నిత్యవసరాలు, ఆర్థిక సాయం అందించింది. వెన్నెముక ఆపరేషన్ చేయించుకుని నడవలేని స్థితిలో ఉన్న గుండుగొలను గ్రామానికి చెందిన విద్యార్థి అరసంకల చైతన్య కృష్ణ రూ.5 వేలు, దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్న పోలసానిపల్లిలోని నడిపల్లి నీలిమ దేవికి రూ.5 వేలు మానవత మండల ప్రతినిధులు అందజేశారు. ఇటీవల ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో మంచాన పడిన భీమడోలుకు చెందిన కూలీ బొత్సా కుసుమకుమారికి బియ్యం, నిత్యవసరాలు, రూ.3 వేల సాయం అందించారు. మాజీ జెడ్పీటీసీ కరణం పెద్దిరాజు, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, కోశాధికారి గుల్ల అప్పారావు, ప్రతినిధులు పూడి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ చిలపర్తి రామారాయుడు, మాజీ ఉపసర్పంచ్ బర్ల రమణమూర్తి, ఈడే గిరిబాబు, దూడి రాజేష్ పాల్గొన్నారు.

నేలలు ప్రకృతి సమతుల్యతను కాపాడుతాయి



కొయ్యలగూడెం: మాట్లాడుతున్న ఏడీఏ బుజ్జి బాబు

జంగారెడ్డిగూడెం: నేలలు ప్రకృతి సమతుల్యతను కాపాడుతాయని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అన్నారు. గురువారం కళాశాలలో ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. కళాశాల ఐక్యూ ఏసీ కో–ఆర్డినేటర్ ఎం.మధు, అధ్యాపకులు సీహెచ్ భద్రినారాయణ, టీవీ రాంబాబు, టి.ఝాన్సీరాణి మాట్లాడుతూ మట్టి నీటిని శుద్ధి చేస్తూ జీవ వైవిధ్యానికి ఆవాసంగా ఉంటుందని తెలిపారు. మట్టి వాతావరణంలోని కార్బన్‌ను నిల్వ చేస్తుంది అని గ్లోబల్ వార్మింగ్ తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్.విజయ దీపిక, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుడు జె.రాజశ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

పుడమికి పూజా దినోత్సవం

కొయ్యలగూడెం: ప్రపంచ నేల దినోత్సవ కార్యక్రమం కొయ్యలగూడెం లోని వ్యవసాయ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి చెన్నకేశవులు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కేఆర్‌పురం సహాయ వ్యవసాయ సంచాలకులు పీజీ బుజ్జిబాబు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మితిమీరిన పెస్టిసైడ్స్ వినియోగం వల్ల నేలతల్లి సత్తువను కోల్పోయి చేటు కలుగుతుందన్నారు. సేంద్రియ ఎరువులను వాడి నేలతల్లిని సంరక్షించుకోవాలని తెలిపారు. ఏరువాక కేంద్ర శాస్త్రవేత డాక్టర్ ఫణి కుమార్ పలు పంటలకు పోషక యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించారు. హబ్ మేనేజర్ బి.సోమశేఖర్, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లలిత సుధ, రైతులు పాల్గొన్నారు.

అందుబాటులో గోనె సంచులు

పెదపాడు : రైతు సేవా కేంద్రంలో గోనె సంచులు అందుబాటులో ఉన్నట్టు తహసీల్దార్ ఎ.కృష్ణ జ్యోతి తెలిపారు. కొత్తూరు గ్రామ రైతులు చిరిగిన గోనె సంచులు ఇచ్చారని తమ దృష్టికి రావడంతో మంచి సంచులను అందుబాటులో ఉంచినట్టు చెప్పారు.

నేడు ఆర్‌సీఎం చర్చి ప్రారంభోత్సవం

దెందులూరు: అక్కిరెడ్డిగూడెంలో నిర్మించిన ఆర్‌సీఎం చర్చిని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తారని నాగులదేవునిపాడు ఆర్‌సీఎం చర్చి పారిస్ ప్రీస్ట్ ఇంటి జేవియర్ అన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులందరూ పాల్గొన్నాలని కోరారు.

అనధికార బ్యారన్లు నిర్మిస్తే కఠిన చర్యలు

బుట్టాయగూడెం: పొగాకు రైతులు అనధికార బ్యారన్లు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం వేలం కేంద్రం–1 ఆక్షన్ సూపరింటెండెంట్ బి.శ్రీహరి అన్నారు. మండలంలోని ముప్పినవారిగూడెం, మెట్టగూడెం, కోటనాగవరం, తదితర గ్రామాల్లో పొగాకు బోర్డు అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పొగాకు పంటలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సొంత స్థలాల్లో బ్యారన్లు నిర్మించుకోవాలన్నారు. ఈ ఏడాది బ్రెజిల్, జింబాబ్వే, తదితర దేశాల్లో పొగాకు పంట అధికంగా పండుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ ప్రాంత రైతులు నాణ్యమైన పొగాకును పండించడంతో పాటు బోర్డు నిర్దేశించిన ప్రకారం పంటలు వేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బోర్డు అధికారులు, రైతులు పాల్గొన్నారు.